



# అధఃపాతాళం

జంపాల మురళీకృష్ణ

వెంకటపతి అసహనంగా తుక్కుమంచం లోంచి లేచి కూర్చున్నాడు. చుట్టకొన కొరికి 'థూ' అని వూసి "ఒరే! బుజ్జాడా నిప్పుతేరా!" అనరిచాడు.

అప్పటిదాకా తాత అవస్థ గమనిస్తూనే వున్నా. ఏమీ మాట్లాడని బుజ్జాడు ఒక్కంగలో కొరివి తెచ్చి తాతకు యిచ్చాడు. వెంకటపతి చుట్టంటించి గట్టిగా పీల్చి వొదిలి, కళ్ళు మూసుకొని "వడ్డీ మాఫీ చేస్తార్రా! బతుకులే మాఫీ అయినాక ఇక వడ్డీ మాఫీచేసి లాభం ఏమిటో!" అని గొణుక్కున్నాడు. అగ్గి నెత్తిమీద కాచ్చేవేళ. ఊరంతా మాడి పోతోంది. వరిమింట్లో కొంగు పరిచి నడుంవాల్చిన కామాక్షమ్మ గుండె మండి పోతుంది. ఉండుండి భర్త మొహం కేసి చూస్తుంది. ముడతలుపడిన ఆయన ముఖంలో ఎన్నో అనుభవాల పీడలు... వెంకటపతి వదిలే పొగ సుడితిరిగి గాల్లో కల్సిపోతోంది. ఆయన మనసులో

ఆలోచనలు మెలితిరిగి ఎదపొరల్లో కరిగి పోతున్నాయి. నాలుగేళ్ళ క్రితం దాకా ఆయన కుటుంబం ఉన్నతంగానే బ్రతికింది. వెంకటపతి హయాంలో పట్టిందంతా బంగారమే. శక్తి ఉడుగుతున్న కాలంలో కొడుకు ముత్యాలరావుకి అప్పగించిన వ్యవసాయాన్ని అతడూ సమర్థంగానే నిర్వహించాడు. అదిగో అప్పుడే మొదలు– తుఫాన్లు, కరువులు. ఏటేటా ఏదో ఒక ఉపద్రవం...ముసలితనపు వెంకటపతి దేహం ఒక్కసారి తన ఒక్కగానొక్క కొడుకు గుర్తుకురాగానే వొణికింది. ఓ కన్నీటిచుక్క మూసిన ఆయన రెప్పలనుండి తప్పించుకొని క్రిందికి జారింది. మూడేళ్ళ క్రితం ముత్యాలరావు ముత్యాలరావుగానే వుండేవాడు. ఎంతో ఉత్సాహంతో తనిచ్చే ప్రోత్సాహంతో ఎంతో కృషిచేసి బంగారం పండించేవాడు. మూడేళ్ళ క్రితం...సరిగ్గా మూడంటే మూడేళ్ళ క్రితమే మొదలైంది పతనం. మొదటియేడు ఏపుగా పెరిగిన తెల్లబంగారం– అమతున్న పత్తినంతని గాలివాన మింగేసింది. కుంగిపోయిన కొడుకుకి ధైర్యం కూడదీసి రెండోయేడు మళ్ళీ వేయిస్తే తెగుళ్ళు...చీడలు...పంటంతా ఊడ్చిపెట్టుకుపోయింది.

ఇరవైయ్యేళ్ళ ముత్యాలు అరవైయ్యేళ్ళ ముత్యాలైపోయాడు

అప్పుడు మొదలైంది బ్యాంకులోళ్ళ గోల– అప్పులిస్తాం...అప్పులిస్తాం...ఉద్ధరిస్తాం...ఊళ్ళేలిస్తాం అంటూ. తనే గొడవపెట్టి ముత్యాలుచేత బ్యాంకులోను తీయించి కూరగాయతోట లేయించాడు. పంట బాగానే చేతికొచ్చింది. అయితే ఆ ఏడు పత్తినంట విపరీతంగా అయ్యింది. చాలామంది పత్తి వెయ్యలేదు. వేసినవాడు బొమ్మ గోతాల్లో ఎత్తుకొన్నాడు. అదిగో అప్పుడు మొదలైంది, ఆశ...కష్టాన్ని నమ్ముకొనే రైతును కమ్ముతున్న ఆశ. మళ్ళీ బ్యాంకులోళ్ళ గోల...అప్పులు...కావాలి. వీలైనంత ఎక్కువే కావాలి. వున్న భూమంతా లాభాల్తో పొంగాలి. ఇల్లంతా నిండాలి. దొరికినకాడికి దొరికినంత తెచ్చారు అయినకాడికి అమ్మేవన్నీ అమ్మారు. మొత్తం పత్తివేశారు. బ్రహ్మాండగా పైరుచేసింది. తెల్లదోమ- మనకి తెల్లోళ్ళు చేసినంత కీడు చేసింది. మొత్తం పైరుని ఆశించింది. మందులు– మందులు– చంపాలి – దీన్ని నాశనం చెయ్యాలి...మళ్ళీ అప్పులు....దొరికిన చోట దొరికినంత...డబ్బు...మందుల కింద మారింది. పంటతోపాటు మందును కూడా తిన్నాయి దోమలు. మందులుతిని మరీ పెరిగాయి. దొంగమందులమ్మి పెరిగిన వ్యాపారుల బొమ్మల్లా పెరిగాయి. ధ్వంసం అయిపోయింది పైరు. రైతులకు ఏడవటానికి కూడా ఓపికలేనంత పనయ్యింది. ముత్యాలు పిచ్చోడే అయిపోయాడు. అదిగో అప్పుడు మొదలు




మళ్ళీ బ్యాంకులోళ్ళ గోల...కక్కు... కుక్క...ఎవడబ్బ సొమ్ము-మర్యాదగా యివ్వు 'ఎక్కడిదివ్వాలి? ఎండిపోయిన శరీరంలో కండకూడాలేదు అమ్ముకోటా నికి. ఎన్నో ఏళ్ళ అనుభవంతో ఎత్తు పల్లాలు ఎక్కిదిగిన తనకే ఈ పరిస్థితి మింగుడు పడలా? ఇక వాడేంటి? పిల్ల నన్నాపి. ముందుకొచ్చిన ప్రమాదాలు చూసి జడిసిపోయాడు. రాత్రికి రాత్రి పెళ్ళాంతో కలిపి పురుగుమందు పంచు కొన్నాడు. చిన్నపాటి దోమను మింగ లేని మందు చిన్నారి జంటను అమాంతం మింగేసింది. కొంగు నోట్లో కుక్కుకుని ఎక్కిళ్ళు పెడుతున్న కామాక్షమ్మ దుఃఖం తాలూకు శబ్దం వెంకటపతి ఆలోచనలు పగలగొట్టింది. ఆయన తలెత్తి భార్య వంక చూశాడు. ఆవిడ తల నేలకేసి కొట్టుకొంటోంది. బుజ్జాడు తాతకేసీ, ముత్తవ్వకేసీ మార్చి మార్చి చూస్తు న్నాడు బెదురుగా. వెంకటపతి వాడికేసి చూసి 'రమ్మన్నట్టు' తల వూపాడు. వాడు రాగానే వాణ్ణి గుండెల కదుము కొని ఒక్క ఉదుటున మంచంలో వాలాడు. ఆయనకు కొంతలో కొంత శాంతి దొరికినట్లయింది. బుజ్జాడు బిత్తర పోయి మరింతగా తాతని అల్లుకున్నాడు. వెంకటపతి కళ్ళు మూసుకొని బుజ్జాడిని జోకొడుతున్నాడు. ఆయన మనసు మళ్ళీ గతాన్ని రెచ్చగొడుతోంది.

"శవపంచాయతీ జరిగింది...వుహూ ...జరుగుతుంది. అధికారి తాలూకు బంట్రోతు కాబోలు వచ్చాడు తన దగ్గరికి వాడన్నాడు గదా—ఈ శవాలు రైతుల ఆత్మహత్యని వాళ్ళు రాస్తే రెండు శవా లకి కలిపి పదివేలిస్తారట. వాటిలో ఐదు వేలు వాళ్ళకిస్తే అలా రాస్తారట. కళ్ళ లోంచి నీళ్ళకి బదులు రక్తం కారుతుం దేమో అన్నంత కోపం వచ్చింది తనకి. ఈడ్చికొట్టాడు వాణ్ణి. అందరూ వచ్చి పట్టుకున్నారు తన్ని. తర్వాత చాలా తర్జనభర్జనలయ్యాక కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్యని రాసిపోయారు.

పోలీసులు పట్టారు తర్వాత. తను మాత్రం కొడుకునీ, కోడల్నీ అమ్మ దలుచుకోలేదు. ఛీ, ఛీ! గాడిద కొడుకులు! శవాల్ని పీక్కుతినే రాబందులు. ఇదిగో యింతా అయ్యాక ఇప్పుడు బ్యాంకువాళ్లు ఏమీ ఎరగనట్టు వడ్డీ తగ్గిస్తాం. ఇంకా రెండేళ్ళు ఆగుతాం. అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. ప్రభుత్వం విదిల్చిన జాలికి ఆత్మాభిమానమున్న ఆ రైతు హృదయం భగ్గుమంది. బుజ్జాయి జాగ్రత్తగా పక్కలో పడుకోబెట్టి లేచి వెళ్ళి బల్లసొరుగు తీశాడు. ఉదయం బ్యాంకువాళ్ళ నుంచి వచ్చిన ఉత్తరం - వడ్డీ తగ్గిస్తున్నామంటూ - వెంకటపతి సొరుగులోంచి పాత పెన్సిలు తీసి మొండి పోయిన దాని ముక్కుతోనే బ్యాంకువాళ్ళకి, ఆ ఉత్తరం వెనకవున్న ఖాళీలో రాయ సాగాడు. వృద్ధాప్యంలో వున్న ఆయన చెయ్యి వొణుకుతూ వుంటే తన ఆలోచనలతో పాటు దాన్నీ అదుపుచేయాలని ప్రయత్నిస్తూ ఇలా రాశాడు.

అయ్యా!

మీరు పంపిన ఉత్తరం అందింది.

అయితే ఇకపొండి మీరు రైతులకు అప్పులిచ్చే కార్యక్రమం మొదలుపెట్టొద్దని ప్రార్థన మిమ్మల్నీ మీరు చూపెట్టే ఆశల్నీ చూసి శక్తికిమించి పాకులాడి ప్రాణాలు తీసుకొనే రైతుల్ని కాపాడటానికైనా మీరు అప్పులివ్వద్దు బాబూ! వద్దు! రైతుల్ని రక్షిస్తాం అంటూ అన్ని వైపుల్నించీ అందరూ భక్షిస్తున్న ఈ కాలంలో మీరైనా దయతల్చండి. అప్పులిచ్చి రైతుని అధఃపాతాళానికి తొక్కవద్దు. ఇది ఈ ముసలివాడి వేడుకోలు.

సెలవు.

వెంకటపతి.

రాస్తుంటే ఆయన సజల నయనాలు వర్షించి కాగితం తడిపేశాయి. అయితే ఆయన ఈసారి తన హృదయ వేదనను కొంతవరకైనా పరిహరించే ఆ అశ్రుబిందువులను ఆపే ప్రయత్నం చెయ్యలేదు. ఎంతటి దుఃఖాన్నైనా తేలిగ్గా తీసుకొని ఎదురీతలో జీవించగల తెలుగు రైతుకు నిజమైన ప్రతీక అన్నట్టుగా...

• • •